



అన్నారం బరాజ్ వద్ద వాసుదేవరెడ్డితో మాట్లాడుతున్న కేటీఆర్

## అడుగడుగునా సాదర స్వాగతం

హైదరాబాద్ నుంచి కాళేశ్వరం యాత్రకు బయల్దేరిన బీఆర్ఎస్ బృందానికి దారిపొడవునా ప్రజలు, రైతులు సంఘీభావం ప్రకటించారు. భూపాలపల్లి నుంచి బయల్దేరిన బృందానికి భూపాలపల్లి, కాటారం, మహదేవపూర్, బెగులూరు తదితర గ్రామాల్లో రైతులు బీఆర్ఎస్ బృందానికి ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక బస్సులో వెళ్తున్న కేటీఆర్‌కు రైతులు, ప్రజలు పుష్పగుచ్ఛాలు అందించి నీరాజనం పట్టారు. కాగా యాత్రకు ఒక రోజు ముందుగానే గురువారం జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లో రైతులు కాళేశ్వరం నీటిని వదలాలని, ఎండుతున్న తమ పంటలను కాపాడాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్లకు వినతిపత్రాలు అందజేసిన విషయం తెలిసిందే.



బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి మేడిగడ్డ బరాజ్‌ను పరిశీలిస్తున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# ప్రజల ముందు.. కాంగ్రెస్ కుట్రలు

**బట్టబయలు చేసిన బీఆర్ఎస్**

**'కాళేశ్వరం యాత్ర'తో వెలుగులోకి నిజాలు**

### తెలంగాణ జీవధార వద్దకు కదలివచ్చిన గులాబీ దండు.. 'చలో మేడిగడ్డ' పర్యటనను స్వాగతించిన రైతులు.. దారిపొడవునా రామన్నకు సాదర స్వాగతాలు

*జయశంకర్ భూపాలపల్లి, మార్చి 1(నమస్తే తెలంగాణ) : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలను ప్రజల ముందు బీఆర్ఎస్ బయటపెట్టింది. నాలుగు నెలల క్రితం మేడిగడ్డ బరాజ్‌లో ఒక ఫిల్లర్ కుంగగా కాంగ్రెస్ ప్రభుత్వం మరమ్మతులు చేయకుండా విచారణ పేరుతో జాప్యం చేస్తుండడంపై బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో రైతులు, ప్రజలకు నిజానిజాలు తెలియజేసేందుకు శుక్రవారం 'కాళేశ్వరం యాత్ర' చేపట్టగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి మేడిగడ్డ, అన్నారం బరాజ్‌లను పరిశీలించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వానకాలంలోగా బరాజ్‌కు మరమ్మతులు చేసి రైతులకు నీళ్లందించి న్యాయం చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే బీఆర్ఎస్‌ను బద్‌నాం చేసేందుకు మేడిగడ్డ అంశాన్ని రాద్ధాంతం చేస్తున్నదని, కాళేశ్వరాన్ని నీటిపాలు చేసే కుట్రలు చేస్తున్నదని రైతులకు వివరించగా, అన్నారం బరాజ్ వద్ద బీఆర్ఎస్ బృందానికి, రైతులకు మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే కడియం శ్రీహరి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.*




అన్నారం బరాజ్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్

బీఆర్ఎస్ బృందం మధ్యాహ్నం 2.30 గంటలకు భూపాలపల్లిలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయానికి చేరుకుంది. అక్కడ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి భోజన సౌకర్యం ఏర్పాటు చేయగా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్‌రావు, మాజీ డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఇతర మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు భోజనం చేసి 3:25 గంటలకు మేడిగడ్డకు బయల్దేరారు. సుమారు 4.50 గంటలకు బీఆర్ఎస్ బృందం మేడిగడ్డకు చేరుకుంది. పోలీసులు బరాజ్‌లోనికి అనుమతించకపోవడంతో బీఆర్ఎస్ నేతలు ఒక్కసారిగా తోసుకుంటూ వెళ్లిపోయారు. బరాజ్‌లోకి దిగి కుంగిన ఫిల్లర్లతో పాటు ప్రతి ఫిల్లర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. కేవలం మూడు, నాలుగు ఫిల్లర్లు మినహా ఇతర ఫిల్లర్లకు ఎలాంటి నష్టం జరుగలేదని నిర్ధారించారు. నాలుగు ఫిల్లర్లను తొలగించి మళ్లీ నిర్మిస్తే మేడిగడ్డ ప్రాజెక్టు ఉపయోగంలోకి వస్తుందని, ప్రస్తుతం ఇక్కడ కాఫర్ డ్యాం నిర్మించి రైతులకు నీరు అందించవచ్చని తేల్చి చెప్పారు. ఆ తర్వాత అక్కడినుంచి అన్నారం బరాజ్‌కు వెళ్లారు. బరాజ్‌లో ఏర్పడిన సీపేజ్‌లను పరిశీలించారు. చిన్న చిన్న సీపేజ్‌లు సాధారణమని, ప్రభుత్వం ప్రతి విషయాన్ని భూతద్దంలో చూపిస్తూ బీఆర్ఎస్‌ను బదనాం చేసి కాళేశ్వరాన్ని నీటిపాలు చేసే కుట్రలు చేస్తున్నదని అక్కడికి వచ్చిన రైతులకు వివరించారు. అనంతరం అన్నారం వద్ద ఏర్పాటు చేసిన వేదికపై కడియం శ్రీహరి, హరీశ్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

## బీఆర్ఎస్ కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు

చలో మేడిగడ్డ కార్యక్రమం పోలీసుల తీరుతో కొద్దిసేపు ఉద్రిక్తంగా మారింది. కేటీఆర్ బృందం వెళ్తున్న నేపథ్యంలో అక్కడికి చేరుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు బ్రిడ్జి మెయిన్ గేట్ మూసివేసి అనుమతించకపోవడంతో కార్యకర్తలు ఆందోళన చేశారు. మెయిన్ గేటు తీసుకొని బ్రిడ్జిపైకి వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ కార్యకర్తలు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. ఈక్రమంలో కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి. తొక్కిసలాటలో ఓ మహిళా కార్యకర్త కిందపడింది.



మేడిగడ్డ బరాజ్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు

## వెంటనే రిపేర్లు చేసి రైతులకు నీళ్లివ్వాలి

**వానకాలంలోగా పూర్తి చేసి వినియోగంలోకి తేవాలి**

**రైతులపై పగపట్టొద్దు.. వారికి న్యాయం చేయాలి**

**మేడిగడ్డ బరాజ్ పరిశీలనలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

మహదేవపూర్, మార్చి 1 : కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్‌లో కుంగిన పియర్లకు ప్రభుత్వం వెంటనే మరమ్మతు చేసి రైతులకు నీరందించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోరారు. ముందుగా మేడిగడ్డ బరాజ్ సందర్శనకు వచ్చిన కేటీఆర్ బృందానికి బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ ఘన స్వాగతం పలికి స్వయంగా బరాజ్ వద్దకు తీసుకెళ్లారు. అనంతరం అన్నారం వద్ద వేదికపై కేటీఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే మేడిగడ్డ అంశంపై రాద్ధాంతం చేస్తున్నదని మండిపడ్డారు. వానకాలంలో వరద వచ్చే నాటికి మేడిగడ్డలో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి నీళ్లు ఎగువకు లిఫ్ట్ చేయాలని తెలిపారు. రైతులపై, రాష్ట్రం మీద పగబట్టొద్దని, కోపం ఉంటే తమపై చూపాలని రైతులను ఆగం చేయొద్దని కోరారు. 1.6 కి.మీ.ల బరాజ్‌లో 50 మీటర్లలో సమస్యలు ఉంటే అదేదో ఎప్పుడూ జరగనట్టు కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం తగదన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కడెం, గుండ్లవాగు సహ ఎన్నో ప్రాజెక్టులు కొట్టుకుపోయిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే నిపుణుల సలహాలు, సూచనలు తీసుకొని దిద్దుబాటు చర్యలు చేపట్టి బరాజ్‌ను పునరుద్ధరించి రైతులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం ఇరిగేషన్ నిపుణులు దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ బరాజ్‌లో ఏర్పడిన సమస్యలను గుర్తించి గ్రౌటింగ్ చేసి బరాజ్‌ను కాపాడాలన్నారు. బరాజ్‌ను ఇలాగే వదిలేస్తే మరింత నష్టం వాటిల్లే ప్రమాదముందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం ఏమాత్రం ఆలస్యం చేయకుండా సత్వరమే మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలన్నారు.

## సీఎం సీటుపై కాంగ్రెస్‌లో లొల్లి పుడుతది..

**ఆరు నెలల్లో అన్నీ బయటపడుతయ్**

**కావాలనే కాళేశ్వరంపై తప్పుడు ప్రచారం**

**వాస్తవాలను బీఆర్ఎస్ శ్రేణులు ప్రజలకు వివరించాలి**

**మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**

లింగాలఘనపురం, మార్చి 1 : 'బీఆర్ఎస్ శ్రేణులంతా ఓపిక పట్టండి.. ఆరు నెలల్లోనే సీఎం సీటు కోసం కాంగ్రెసోళ్లు లొల్లి పెట్టుకుంటరు.. ఇప్పటికే చాలా మంది సీనియర్లు కస్సు బుస్సుమంటున్నారు.. ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయలేక.. సొంత కుంపట్లతో ఆగం చేస్తరు..' అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో శుక్రవారం చేపట్టిన మేడిగడ్డ యాత్ర హైదరాబాద్-వరంగల్ హైవేపై నెల్లుట్ల బైపాస్ వద్దకు చేరుకోగా పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ ప్రాజెక్టులను కొల్లగొట్టిన సంస్కృతి కాంగ్రెస్‌దన్నారు. ఎస్ఆర్ఎస్పీ కాల్వ తవ్వకాలప్పుడు, బాబ్లీ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో తాను తెలంగాణ ప్రయోజనాల కోసం ఉద్యమించానన్నారు. ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయలేక కాంగ్రెస్ పార్టీ నేతలు కాళేశ్వరంపై కట్టు కథలు ప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఐక్యంగా నిలిచి కాళేశ్వరం ప్రాజెక్టుపై వాస్తవాలను గ్రామాల్లో ప్రజలకు వివరించాలన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తుంటే అక్రమంగా కేసులు పెడుతున్నారని, దీనికి తాము భయపడమన్నారు. 'మనం ఎవరి తెరువు పోవొద్దు.. మన తెరువుకు వస్తే ఊరుకోవద్దు.. టచ్ చేస్తే తాట తీద్దాం..' అని పిలుపునిచ్చారు.

**మేడిగడ్డ బ్యారేజీ వ్యయం రూ.3 వేల కోట్లే : ఎమ్మెల్యే కడియం**

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ బరాజ్‌కు రూ.3 వేల కోట్లు వ్యయం చేస్తే కాంగ్రెస్ నేతలు దీనిని పెద్దగా చేసి చూపుతూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. బ్యారేజీలో కుంగిన పిల్లర్లను సరి చేస్తే సరిపోతుందన్నారు. కేటీఆర్ చేపట్టిన పర్యటన ప్రజలకు వాస్తవాలను తెలిపేందుకేనని ఆయన పేర్కొన్నారు. ఈ. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, పెద్ది సుదర్శన్ రెడ్డి, జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షకార్యదర్శులు బస్వగాని శ్రీనివాస్‌గౌడ్, గవ్వల మల్లేశం నాయకులు దూసరి గణపతి, మల్ల శ్రీశైలం, ఏదునూరి వీరన్న, బక్క నాగరాజు పాల్గొన్నారు.



నెల్లుట్ల బైపాస్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి మేడిగడ్డ బరాజ్‌ను పరిశీలిస్తున్న కేటీఆర్





మేడిగడ్డ బరాజ్ వద్ద మాజీ ఎమ్మెల్యేలు అరూరి, దాస్యం, పెద్ది తదితరులు



మేడిగడ్డ బరాజ్ వద్ద బీఆర్ఎస్ నాయకులు

## పోలీసుల తీరుపై కేటీఆర్ సీరియస్

**జై తెలంగాణ అంటే థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా?**

**రేవంత్ ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గి అక్రమ కేసులు పెడుతున్నారు**

**బాధితులకు పరామర్శ, అండగా ఉంటామని హామీ**

**అవసరమైతే కోర్టును, మానవ హక్కుల సంఘాలను ఆశ్రయిస్తామని స్పష్టం**

పరకాల/ఆత్మకూరు/దామెర, మార్చి 1: ప్రజాపాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన రేవంత్ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల ఒత్తిడికి తలొగ్గి పోలీసులు అత్యుత్సాహం చూపుతున్నారని, జై తెలంగాణ అంటే థర్డ్ డిగ్రీ ప్రయోగించడమేంటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మేడిగడ్డకు వెళ్తూ మార్గమధ్యలో 'అగ్రంపహాడ్ ఘటన'లో పోలీసు బాధిత బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులను నగర శివారులోని ఎన్ఎస్ఆర్ హోటల్‌లో ఆయన పరామర్శించారు. అనంతరం వారి నుంచి వివరాలు తెలుసుకొని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 'జై తెలంగాణ' నినాదాన్ని నిషేధించారా అని ప్రశ్నించారు. జై తెలంగాణ అంటే అక్రమ కేసులు బనాయించి, దేశ ద్రోహుల్లాగా రాత్రికి రాత్రే అరెస్టు చేసి చిత్రహింసలు పెడతారా అని మండిపడ్డారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, పోలీసులు చట్టబద్ధంగా వ్యవహరించాలన్నారు.

**సీపీకి కేటీఆర్ ఫోన్**

జాతరలో పోలీసులు వ్యవహరించిన తీరుపై లోతైన విచారణ జరిపించాలని కేటీఆర్, వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝాను కోరారు. ఈ విషయమై కేటీఆర్, సీపీకి ఫోన్ చేశారు. ఆత్మకూరు ఎస్సై ప్రసాద్‌పై వేటు వేసినప్పటికీ కొందరు పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ ఘటనతో సంబంధం ఉన్న ప్రతి అధికారిపై విచారణ చేపట్టి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, లేకపోతే న్యాయస్థానాలు, మానవ హక్కుల సంఘాలను ఆశ్రయిస్తామని, బాధితులకు న్యాయం జరిగే వరకూ పోరాడతామని స్పష్టం చేశారు.

**గులాబీ సైనికులకు అండగా ఉంటాం..**

పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ తాము అండగా నిలుస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ప్రత్యేక తెలంగాణ పోరాటంలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులకు నిర్బంధాలు కొత్తేమీ కాదని, పార్టీ బలోపేతానికి శ్రమించే ప్రతి గులాబీ సైనికున్ని కంటికి రెప్పలా కాపాడుకుంటామని చెప్పారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కక్షగట్టిన పోలీసులను వదిలిపెట్టే ప్రసక్తి లేదని, అవసరమైతే ఢిల్లీ వరకు వెళ్లి న్యాయం జరిగేందుకు కొట్లాడతామని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే పార్టీ చూస్తూ ఊరుకోదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి